# కప్పు కాఫీ

మా అమ్మ చేసే కాఫీ అమృతంలా ఉండేది. తొందరగా తాగేస్తే ఆ రుచి ఎక్కువసేపు ఆస్వాదించడానికి అవకాశం ఉండదని, వీలైనంత మెల్లగా తాగేవాణ్ణి. 'ఎంతసేపు నాన్నా... స్కూలుకి టైమవుతోంది' అంటూ అమ్మ చేసే హెచ్చరికలో ఎంతటి మురిపెమో... ఎంతటి ముద్దో... అమ్మ చేతి కాఫీలా... మధురంగా...

"అలా నిప్పులమీద కూచున్నట్టు... ఎందుకా తొందర? కాఫీ తాగేప్పుడైనా నింపాదిగా తాగొచ్చుగా" అంది నిర్మల... మూడు దశాబ్దాల సాహచర్యంలో తను నమ్మిన మార్గంలోకి నన్ను మళ్ళించటంలో విఫలమైనా, నేను నమ్మిన సిద్ధాంతాలతో బలంగా విభేధించే నా భార్య...

"నేనో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీకి సి.ఈ.వో నన్న విషయం మర్చిపోతున్నావు. అంత తీరికే ఉంటే మా కంపెనీ ఎక్స్‌పోర్ట్స్‌ని మరింత పెంచడానికి ప్రయత్నించేవాణ్ణి కదా" కాఫీ కప్పుని డైనింగ్ టేబిల్ మీద పెట్టూ లేచి నిలబడ్డాను.

"తిండి మీద ధ్యాసలేకుండా కంటినిండా సరైన నిద్ర లేకుండా ఇదేం వ్యాపకమండీ. మనం సుఖంగా బతకడానికి కావల్సినంత సంపాదించారుగా. యింకా ఈ పరుగెందుకు? యిప్పటికైనా ఆపండి. ఎక్కడ పడిపోతారోనని భయమేస్తోంది"

నాకు నవ్వొచ్చింది. ఎంత అమాయకురాలు! పరుగాపితే వెనకబడిపోమా?

"పడిపోయినా లేచి పరుగెత్తేవాడే విజేత"

"కోట్లు సంపాదించడమో, మీ కార్పొరేట్ సంస్థ టర్నోవర్ని వేల కోట్లకు చేర్చడమో చేస్తే విజేత అనట్లా? వీటిని పొందాలనే ఆరాటంలో జీవితంలోని ఎన్ని అందమై

అనుభూతుల్ని కోల్పోతున్నారో ఆలోచించారా? నా ఉద్దేశంలో జీవితాన్ని మనసారా ఆస్వాదిస్తూ జీవించినవాడే విజేత. తనను తాను జయించినవాడే విజేత"

"నీ ఆలోచనలు, ఆదర్శాలు నేటి వేగవంతమైన జీవితాల్లో పనికి రావు నిర్మలా. రాకెట్‌లా ముందుకు దూసుకువెళ్తేనే మనుగడ. మనిద్దరం భిన్న ధృవాలం. మన ఆలోచనలు ఎన్నటికీ కలవ్వు.నాకు ప్రతిదీ ఈ ప్రపంచలోకెల్లా ది బెస్ట్ కావాలి. దానికోసం ఎంత శ్రమైనా పడ్తాను. ఎన్ని త్యాగాలైనా చేస్తాను"

నిర్మల దీర్ఘంగా నిట్టూర్చింది.'మనశ్శాంతినివ్వలేని యివన్నీ ఎందుకు.. దండగ' అంటూ గొణుక్కుంది.

నేను బైటికొచ్చేముందు టేబుల్ మీదున్న కాఫీ కప్పు వైపు చూశాను. ఎంతందమైన కప్పు! ఎంత ఖరీదైందీ! అటువంటి అరడజను కప్పుల్ని జర్మనీ నుంచి తెప్పించాను. నిఖార్సయిన ఏనుగు దంతాల్తో చేసి, నగిషీలు చెక్కిన కప్పులు... అటువంటి కప్పులో కాఫీ తాగితేనే మజా..

మెర్సిడెస్ బెంజ్ కార్లోకి ఎక్కుతూ నా యింటి వైపు చూసుకున్నా. కొన్ని కోట్లు ఖరీదు చేసే అత్యాధునికమైన భవంతి... విదేశాల్నుంచి కూడా ఆర్కిటెక్ట్‌లని పిలిపించి కట్టుకున్న రమ్యమైన కట్టడం.

నేను జీవితంలో కోరుకున్నవన్నీ సాధించాను. ఎన్నో శిఖరాలు అధిరోహించాను. కానీ ఒకే విషయంలో అసంతృప్తి. నా కూతురు ప్రత్యూష...దానికన్నీ వాళ్ళమ్మ బుద్ధులే వచ్చాయి. డబ్బు సంపాదించడం అన్నిటికన్నా చాలా ముఖ్యం అని నేనన్నప్పుడల్లా 'సుఖానికీ డబ్బుకీ సంబంధం ఉందేమోకాని సంతోషానికీ డబ్బుకీ సంబంధం లేదు' అనేది.

అమెరికాలో ఆర్కిటెక్చర్ చదివిద్దామనుకున్నా. ససేమిరా అంది. 'ఎప్పుడూ డబ్బు సంపాదన గురించే ఆలోచిస్తావేం నాన్నా. యింజనీరింగ్ ఒక్కటే చదువా...బియ్యేలు బికాంలు చదువులు కాదా..ఏ చదువైనా మనిషిని ఉన్నతుడిగా, సంస్కారవంతుడిగా తయారుచేస్తే చాలు. యిక్కడ ఉన్నతత్వం అంటే మేధోపరమైంది. నువ్వనుకునేలా మనీ పరమైంది కాదు' అంది.

'నువ్వు దాన్ని ఆదర్శం అనుకుంటున్నావేమో. దాన్ని చాతకానితనమంటారు. ఎంత ఎక్కువ డబ్బు సంపాదిస్తే అంత గొప్ప ఈ రోజుల్లో. ఎలా సంపాయించారనేది ఎవ్వరికీ

అక్కరలేదు. ఎవ్వరూ పట్టించుకోరు' అంటే మెత్తగా నవ్వి 'డబ్బుతో సంబంధం లేకుండా జీవితాన్ని సంతోషంగా గడపొచ్చనేది నానమ్మకం నాన్నా... ఏదో ఓ రోజు దాన్ని నిరూపించి చూపిస్తాను' అనేది.

ప్రత్యూష నవ్వితే మా అమ్మ నవ్వినట్లే ఉండేది. దానికి పదేళ్ళున్నపుడు మా అమ్మ చనిపోయింది. అప్పటినుంచీ మా అమ్మని నా కూతుర్లోనే చూసుకునేవాణ్ని. అంతగా ప్రేమించిన ప్రత్యూష చివరికలా చేస్తుందని కలలో కూడా వూహించలేదు. నా గుండెల మీద ఎడం కాల్తో తన్నినట్లు... నా పరువుని నడిబజార్లో వేలానికి పెట్టినట్టు... ఎంత గాయం చేసిందో... ఎన్నటికీ మానని గాయం... ఆరేళ్ళయినా యింకా తాజాగా సలుపుతున్న గాయం...

ఆఫీస్‌లో నా ఛాంబర్లోకెళ్ళి కూచున్నా. పని వత్తిడిలో పడి గాయం సంగతే మర్చిపోయాను. సాయంత్రం ఐదుంపావుకి రామం వాళ్ళమ్మాయి ఫోన్ చేసింది. "అంకుల్... నాన్న మిమ్మల్నోసారి హాస్పిటల్ కి రమ్మన్నారు. ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడాలట"

"నాన్నకెలా ఉందమ్మా" అని అడిగాను.

"ఆపరేషన్ ఎల్లుండి చేస్తామంటున్నారంకుల్. ఆ తర్వాత కెమోథెరపీ అవసరమట"

"యింటికెళ్ళేముందు వస్తానని చెప్పు" అన్నాను.

రామం యింజనీరింగ్ కాలేజీలో నా బ్యాచ్ మేట్. డిగ్రీ అయ్యాక నేను యం.యస్ కెళ్ళాను. రామం మాత్రం సర్వీస్ కమీషన్ పరీక్షలు రాసి యస్సయ్ ఉద్యోగంలో చేరిపోయాడు. ప్రస్తుతం సర్కిల్ యిన్‌స్పెక్టర్ హోదాలో ఉన్నాడు. కానీ తదుపరి ప్రమోషన్ విషయంలో వెనకబడిపోయాడు. అతనిమీద ఉన్న కంప్లెయింట్ల దృష్ట్యా విజిలెన్స్ కేసు నడుస్తోంది. అందుకే గత మూడేళ్ళుగా అతనికి ముఖ్యమైన బాధ్యతలు అప్పగించకుండా లూప్‌లైన్లో ఉంచారు.

ఆఫీసు వదిలాక అపోలో హాస్పిటల్ కెళ్ళాను. రామం బాగా చిక్కిపోయాడు. మనిషి గుర్తు పట్టలేనంతగా మారిపోయాడు.

"కడుపులో క్యాన్సర్ కదా అన్నయ్యా... ఏది తిన్నా యిమడటం లేదు కక్కేసుకుంటున్నారు. లిక్విడ్స్ మీదే బతుకుతున్నారు. ఎలా ఉండే మనిషి ఎలా ఐపోయారో చూడండి" రామం భార్య కన్నీళ్ళు పెట్టుకుంది.

"నువ్వు నాకో సాయం చేయాలి" అన్నాడు రామం.

"చెప్పు. నా చాతనైన సాయమైతే తప్పకుండా చేస్తాను."

"నా మీదున్న విజిలెన్స్ కేస్ క్లోజ్ ఐపోతుంది. తెల్సిన యం.పి ని పట్టుకున్నాలే. ఈ నెలలో ట్రాన్స్ఫర్ ఆర్డర్లు వస్తాయట. నీకు డైరెక్టర్ జనరల్ బాగా క్లోజ్ కదా. వారికి చెప్పి మంచి స్టేషన్లో పోస్టింగ్ వేయించు. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ లాంటి స్టేషన్లయితే మంచిది"

సాయం అంటే వేరే ఏమైనా అనుకున్నాను గాని యిలాంటిది అడుగుతాడన్న వూహ కూడా రాలేదు. రామం బాగా సంపాయించాడని నాకే కాదు చాలా మందికి తెలుసు. కొడుకుని లక్షల డొనేషన్లు కట్టి డాక్టర్ చదివించాడు. యం. యస్ పూర్తయ్యాక అతను అమెరికాలోనే మంచి హాస్పిటల్లో పన్చేస్తున్నాడు. కూతురికి ఘనంగా పెళ్ళి చేశాడు. అల్లుడు సాఫ్ట్వేర్ యింజనీర్. ఐనా యింకా సంపాయించాలన్న కోరిక... ఈ తాపత్రయాల వల్లనేనేమో క్యాన్సర్ తెచ్చుకున్నాడు. ప్రస్తుతం కడుపునిండా తినే యోగం కూడా లేదు. యిప్పటివరకు సంపాయించింది చాలదా... సూటిగా చెప్తే బాధ పడ్తాడని కొద్దిగా సౌమ్యంగా చెప్పాను.

"రామం... యిపుడు పోస్టింగ్ గురించి ఎందుకు ఆలోచిస్తావు? నీ ఆరోగ్యం గురించి ఆలోచించు. ఎల్లుండి జరగబోయే ఆపరేషన్ గురించి ఆలోచించు. ఎక్కడ పోస్టింగ్ యిస్తే ఏమైంది? నీ జీతం నెల తిరగ్గానే చేతికందుతోందిగా. ఆపరేషన్ ఖర్చులూ, హాస్పిటల్ ఖర్చులూ అన్నీ ప్రభుత్వమే భరిస్తుందాయె. అంతకన్నా ఏం కావాలి చెప్పు. అనారోగ్యంతో పాటు జబ్బు నయం చేసుకోడానికవసరమైన అర్ధబలం లేని అభాగ్యులు మన దేశంలో కోకొల్లలు. వాళ్ళతో పోలిస్తే మనమెంత అదృష్టవంతులమో"

"భలేవాడివే కుమార్... నేనెంత దురదృష్టవంతుణ్ణో నీకు తెలుసుగా. ఎవరో గిట్టనివాళ్ళు నామీద కంప్లెయింట్ చేస్తే విజిలెన్స్ కేస్ తెరిచారు. ఆ సాకుతో గత మూడేళ్ళనుంచి నన్నో అంటరానివానిగా చేసి పనికిరాని పోస్టింగులిస్తున్నారు. ఈ మూడేళ్ళుగా జీతం డబ్బులు తప్ప పైసా ఆదాయం లేక ఎంత నష్టపోయానో. డి.జి.పి గారు నీ మాటని కాదనరు. ప్లీజ్ మంచి చోట పోస్టింగ్ వేయించు"

తనకు క్యాన్సర్ కాబట్టి దురదృష్టవంతుణ్ణంటాడనుకున్నా. కానీ మంచి పోస్టింగ్ యివ్వలేదు కాబట్టి అట. జీతం తప్ప పైఆదాయం పైసా కూడా రాలేదు కాబట్టి

నష్టపోయానంటున్నాడు. ఎంతటి దుర్మార్గపు ఆలోచన! సరైన ఉద్యోగాలు లేక, తమ అర్హతకు సరిపడ ఉద్యోగాలు రాక ఎన్ని కోట్లమంది నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారో...

"ఆపరేషన్ తర్వాత కొన్ని నెలలైనా రెస్ట్ తీసుకోకుండా ఉద్యోగంలో జాయిన్ కావాలని ఎందుకనుకుంటున్నావు? ఏదైనా ఆరోగ్యం తర్వాతే కదా. అసలు నువ్వు ఉద్యోగం చేయాల్సిన అవసరమేముంది? వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకోవచ్చుగా"

"అమ్మో.... ఆ మాటనకు. బోలెడు డబ్బు ఖర్చుచేసి విజిలెన్స్ కేస్ లేకుండా చేసుకుంది యింట్లో కూచోడానికి కాదు. దానికి పదింతలు సంపాయించుకోడానికి" అన్నాడు.

ఎంత చెప్పినా రామం వినడని తెల్సిపోయింది. "సరే. ప్రయత్నిస్తాను. నామీద భరోసా మాత్రం పెట్టుకోకు. వేరే ఛానెల్స్ ద్వారా కూడా ప్రయత్నిస్తే మంచిది"అన్నాను.

"నువ్వు చెప్పాలా... నా ప్రయత్నాలు నేను చేస్తున్నాలే. సెంట్రల్ మినిష్టర్ తో చెప్పిస్తున్నా. నువ్వు కూడా ఓ మాట వేస్తే సంతోషం" అన్నాడు.

రామం ఉన్న గదిలోనే కాదు... ఆ హాస్పిటల్ నిండా డబ్బు వాసన. డబ్బు చుట్టే ప్రపంచం తిరుగుతోంది అనే నా ఆలోచనలో తప్పులేదని మరోసారి అనుకున్నాను. చావుకి అతి సమీపంగా ఉన్న రామమే మరింత డబ్బు సంపాయించాలని ఆలోచిస్తుంటే, అదీ అక్రమంగా... మానసికంగా శారీరికంగా ఆరోగ్యంగా ఉన్న నేను బిజినెస్ని రెట్టింపు చేయడం ద్వారా మరింత సంపాయించాలని తాప్రతయ పడటంలో తప్పులేదన్న విషయం నా భార్య నిర్మలకూ, నా కూతురు ప్రత్యూషకు ఎందుకర్థం కాదో..

కూతురు గుర్తుకు రాగానే గాయం మళ్ళా సలుపుతోంది.

యింటికి సమీపంలో ఉన్నప్పుడు పర్సనల్ సెల్ మోగింది.

"హలో" అన్నాను.

"నాన్నా... బావున్నావా" అని విన్పించింది. ప్రత్యూష గొంతు...

కట్ చేశాను. మళ్ళా మోగింది. అదే నంబర్... సెల్ స్విచాఫ్ చేశాను.

నాలుగేళ్ళ క్రితం తనకు నచ్చిన ముస్లిం కుర్రవాడితో వెళ్ళిపోయిన ప్రత్యూష...

మొదట ఆ కుర్రవాణ్ణి యింటికి పిల్చుకొచ్చి మాతో విషయం చెప్పినపుడు పెద్ద

గొడవైంది. కుర్రవాడు డిగ్రీ  రెండుసార్లు తప్పి యిక పరీక్షలు రాయటం మానేశాడట. డిగ్రీ లేకున్నా బతకొచ్చని అతని నమ్మకమట.

'డిగ్రీ లేదు. ఉద్యోగం లేదు.  ఎలా పోషిస్తాడే నిన్ను'  కోపంతో వూగిపోయాను.

'నేను బి.కాం పాసైనాగా. మగవాడే ఉద్యోగం చేసి భార్యాపిల్లల్ని పోషించాలనే రోజులు పోయాయి నాన్నా. నేను సంపాయిస్తాను. నశీర్‌కి సెల్‌ఫోన్ రిపేరింగ్ బాగా వచ్చు. ఖాళీగా ఉండే తత్వం కాదు' అంది ప్రత్యూష.

'హవ్వ... నలుగురూ వింటే నవ్విపోరా? నాన్నేమో పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీకి సి. ఈ. వో. నువ్వేమో సెల్‌ఫోన్ రిపేరుగాణ్ణి చేస్కుంటావా... అందునా మన జాతి కాదు... మన కులం కాదు.'

'నశీర్ మన జాతి కాదని ఎవరన్నారు? మన జాతే.. మనిషి జాతి. అతను పెద్ద ఆఫీసర్ కాకపోవచ్చు. కాని మంచి మనసున్న వాడు. హృదయం  నిండా ప్రేమ నింపుకున్న వ్యక్తి. అతనితో జీవితం తప్పకుండా బావుంటుందన్న నమ్మకంతోనే పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికొచ్చానమ్మా' అంది వాళ్ళమ్మ వైపు తిరిగి.

'నువ్వేం చేసినా బాగా ఆలోచించి చేస్తావన్న నమ్మకం నాకుందమ్మా. నీ నిర్ణయంలో తప్పు ఉండదనే అనుకుంటున్నా. నీ సంసారం పచ్చగా కళకళలాడాలని మనస్ఫూర్తిగా దీవిస్తున్నా. నీకు సుఖ సంతోషాల్ని ప్రసాదించమని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తాను' అంది నిర్మల.

'సుఖసంతోషాలా...  పిచ్చేమైనా పట్టిందా మీకు..దరిద్రంతో  నానా కష్టాలు పడే రాత నీ నుదుట రాసుంటే జీవితం ఎలా బాగుంటుంది? దుర్భరమైన బతుకుని చేతులారా కొని తెచ్చుకుంటున్నావు తెలుసా' అన్నాను ప్రత్యూష వైపు, నిర్మల వైపు నిరసనగా చూస్తూ.

'వాళ్ళిద్దరూ ఒకర్నొకరు యిష్టపడ్డారు. కనీసావసరాలకు చాలినంత డబ్బు సంపాదించుకునే విద్యాబుద్ధులు వాళ్ళకున్నాయి. అంతకంటే ఏం కావాలి హాయిగా బతకడానికి? ఐశ్వర్యాలతో తులతూగుతూ మేం గొప్పగా ఉన్నామనుకోవటం వేరు గొప్పగా బతకటం వేరు' అంది నిర్మల.

'ఆదర్శాలు వల్లించడానికి బాగానే ఉంటాయి  నిర్మలా. ప్రాక్టికల్‌గా చేయాల్సిన

బతుకుపోరులో అవేవీ ఉపయోగపడవు... మనల్ని ఆదుకునేది డబ్బొక్కటే'

'నాన్నా... నేను గొప్పగా బతికి చూపిస్తాను. అప్పటివరకు మీకు కన్పించను. మీ గుమ్మం తొక్కను' అని నశీర్ చేయి పట్టుకుని నాలుగేళ్ళ క్రితం వెళ్ళిపోయిన ప్రత్యూష...

'అదేదో ఘోరమైన తప్పు చేసినట్లు దాన్నెందుకు శిక్షిస్తున్నారు? వాళ్ళ బతుకేదో వాళ్ళు బతుకుతున్నారు. మీ నుంచి ప్రేమ తప్ప మరేమీ ఆశించడం లేదే...ఆ కుర్రాడు కూడా ఎంత బుద్ధిమంతుడో... మనల్నెపుడైనా యిబ్బంది పెట్టాడా... దానికి కూతురు పుట్టిన క్షణంనుంచీ మిమ్మల్ని ఒక్కసారి రమ్మని ఎలా బతిమాలుకుంటుందో... మరీ అంత రాతి హృదయం మంచిది కాదండీ... మనవరాలికి మూడేళ్ళు వచ్చాయి. వెళ్ళి చూసి రండి' యింట్లోకి అడుగు పెట్టానో లేదో నిర్మల దండకం ప్రారంభించింది.

"నేను వెళ్ళను. కావాలంటే నువ్వెళ్ళిరా" అన్నాను.

"అబ్బో... ఎంత ఔదార్యమో... మీరేమీ చెప్పక్కరలేదు. నేను చాలాసార్లు వెళ్ళాగా... అది కోరుకుంటుంది మీరు రావాలని. దాన్నెందుకు హింస పెడ్తారు? కన్న కూతుర్ని అలా ఏడ్పించడం శుభం కాదండీ. వెళ్ళి రండి"

నేనేమీ రాతి మనిషిని కాను. నాకూ వెళ్ళాలనే ఉంది. మనవరాలి ముద్దు ముద్దు మాటల గురించి నిర్మల చెప్పిన ప్రతిసారీ ప్రాణం ఎలా కొట్టుకునేదో... నా మనవరాల్ని చూడాలని... ప్రత్యూష మీద నాకు ప్రేమ లేదనుకుంటుంది పిచ్చిది. ప్రేమ ఉండబట్టే కదా అది పేదరికంలో బతక్కూడదని, నాలా సిరి సంపదల్లో తులతూగాలని ఆరాటపడింది! ఓ వేళ వెళ్ళాలనుకున్నా  నాకంత తీరికేది?

"రెండ్రోజులు ఆఫీస్ కెళ్ళనంత మాత్రాన మిన్ను విరిగి మీద పడదు. ఎల్లుండి దాని పుట్టిన రోజు... మర్చిపోయారా? దయచేసి వెళ్ళిరండి. అది చాలా సంతోషపడ్తుంది" అంది.

"రెండ్రోజులు కాదు... ఒక్క రోజు. రేపుదయం బయల్దేరి వెళ్తా. రాత్రికుండి ఉదయానికి తిరిగొచ్చేస్తా. దాంతో నువ్వే చెప్పు" అన్నాను.

"తీరా వెళ్ళి మాట్లాడకుండా దాన్ని మరింత బాధ పెడ్తారా ఏంటి?" అంటున్న నిర్మలకు సమాధానం చెప్పకుండా నా గదిలోకెళ్ళిపోయా.

మరునాడుదయం కార్లో బయల్దేరాను. ఎన్నేళ్ళ తర్వాత ఒంగోలు వెళ్తున్నానో! ఒంగోలు... నా బాల్యాన్ని తన గుండెల్లో దాచుకున్న వూరు. డిగ్రీ వరకు చదివింది ఈ వూళ్లోనే. మా నాన్న ఓలాయర్ దగ్గర గుమాస్తాగా పన్చేసేటోడు. 'ఏం బతుకుర్రా మావి... నిజాల్ని బతికించాల్సింది పోయి అబద్ధాలతో పబ్బం గడుపుకునే బతుకు' అంటూ బాధ పడేవాడు. అందుకే నాకు ఉద్యోగం రాగానే అమ్మానాన్నని హైద్రాబాద్ పిలిపించుకుని నాదగ్గరే ఉంచుకున్నా. ప్రత్యూషకి పదేళ్ళ వయసున్నపుడు అమ్మ చనిపోయింది. అమ్మ పోయిన రెండేళ్ళకే నాన్న చనిపోయాడు. ఒంగోల్లో ఉన్న పాత పెంకుటింటిని అమ్మేశాను. ఆ తర్వాత ఒంగోలు వెళ్ళాల్సిన అవసరమే రాలేదు. యిపుడు మళ్ళా యిన్నేళ్ళకు తాత హోదాలో అడుగు పెడ్తుంటే ఏదో తెలీని పులకింత... మనసంతా తుళ్ళింత...

శ్రీనివాసా టాకీస్ వెనకున్న ప్రకాశం కాలనీ... ఒంగోలు పెద్దగా మారలేదు. ఎటొచ్చీ కొత్త కొత్త కాలనీలు చాలా ఏర్పడ్డాయి. ప్రకాశం కాలనీ కూడా కొత్తదే. యిళ్ళు దూరదూరంగా విసిరేసినట్టున్నాయి. యిక్కడ ప్లాట్లు కొనుక్కున్న వాళ్ళలో కొంతమంది మాత్రమే యిల్లు కట్టుకున్నట్టున్నారు. అందుకే ప్రత్యూషవాళ్ళిల్లు కనుక్కోవటం కష్టం కాలేదు,

కారు శబ్దం వినగానే ప్రత్యూష బైటికొచ్చింది. నేను కారు దిగకముందే బొమ్మలా ఉన్న కీర్తి పరుగెత్తుకుంటూ వచ్చింది.

"నువ్వేనా తాతయ్యవి" అంటూ నా మొహం వైపు పరిశీలనగా చూసి "ఆ గుర్తుకొచ్చింది. నువ్వే. అమ్మ నీ ఫోటో చూపించిందిలే. అచ్చం నీలానే ఉంది తాతయ్యా. నువ్వు చూశావా. నేను చూపిస్తాలే" అంది.

నేను కీర్తిని ఎత్తుకున్నాను. మూడేళ్ళ ప్రత్యూషని ఎత్తుకున్నపుడు కలిగిన అనుభూతి పునరావృతమై... పరిపుష్టమై... పరివ్యాప్తమై...

నశీర్ కోసం చూశాను. కన్పించలేదు.

"తను రెండేళ్ళ క్రితం ట్రంక్‌రోడ్‌లో స్వంత షాపు పెట్టాడు. సెల్‌ఫోన్లు బాగుచేసే షాప్. నేను దగ్గర్లోని ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పన్చేస్తున్నాను. నువ్వొస్తున్నావని ఈ రోజు శెలవ పెట్టాలే. నశీర్ కూడా తొందరగా కొట్టు కట్టేసి వస్తానన్నాడు" అంది.

యిల్లు చాలా చిన్నది. హాల్లో మూడు కుర్చీలు, చిన్న టీపాయ్, పోర్టబుల్ టీవీ న్నాయి. వాళ్ళు బెడ్రూంగా వాడుకుంటున్న గదిలో ఓ యినుప మంచం, దానికో పక్కన

యినుప బీరువా ఉన్నాయి. యింట్లో ఉన్న వస్తువుల్లో చెప్పుకోతగ్గవి అవే.

"నాన్నా ఏం చూస్తున్నావు? మా యింట్లో ఏమేం ఉన్నాయనేగా.. ఫ్రిజ్‌లూ ఏసీ మెషిన్లూ, డైనింగ్ టేబుళ్ళు లేవు నాన్నా... అవి కొనేంత స్థోమత మాకు లేదు. నాకొచ్చే జీతం ఈ యింటి అద్దెకీ కరెంట్ బిల్లుకీ ఖర్చయిపోతుంది. నశీర్ తెచ్చే డబ్బుల్తో యిల్లు గడుపుకోవాలి. బిజినెస్ కదానాన్నా.. ఒక్కో నెల్లో కొట్టు కిరాయి, మిగతా ఖర్చులు పోను మా అవసరాలకు సరిపడా మిగుల్తాయి. కొన్నిసార్లు ఆ వచ్చిన డబ్బు కిరాయికే సరిపోదు" అంటూ నవ్వింది. ఆ నవ్వులో దుఃఖం లేదు. నైరాశ్యం లేదు. ఆదాయం సరిపోవటం లేదన్న చింత లేదు. హాయిగా నవ్వింది. పసిపిల్ల నవ్వినట్లు... జీవితాన్ని ఉన్నదున్నట్లు అంగీకరించిన వాళ్ళకు మాత్రమే చాతనైన నవ్వు...

"కీర్తితో కబుర్లు చెప్తో కూచో నాన్నా.... తొందరగా కాఫీ చేసిస్తాను" అంది. కీర్తి కన్నా ఎక్కువ తనే మాట్లాడింది. హైద్రాబాద్‌లో తన స్నేహితులు, చుట్టుపక్కలవాళ్ళు, బంధువులు, నాకొలీగ్స్... యిలా అడుగుతూనే ఉంది...

నశీర్ వచ్చాడు. నన్ను చూడగానే దగ్గరకొచ్చి కాళ్ళకు నమస్కారం చేశాడు. చాలా ముచ్చటేసింది.

నశీర్‌కీ నాకూ కప్పుల్లో కాఫీ యిచ్చి కీర్తికి పాలిచ్చింది. నశీర్ చేతిలోని కప్పు వైపు చూశాను. చాలా చవకరకం పింగాణీ కప్పు.. అంచు కొద్దిగా పగిలిపోయి.. హ్యాండిల్ పూడిపోయి... నా కప్పు వైపు చూసుకున్నాను. ఖరీదైంది కాకున్నా బాగానే ఉంది.

నన్నే గమనిస్తున్న ప్రత్యూష నవ్వింది. "నువ్వు వాడేలాంటి అతి ఖరీదైన కప్పు కొనేంత తాహతు మాకు లేదు నాన్నా... నువ్వు కప్పు బాగుంటేనే కాఫీ తాగుతావని తెలుసుగా. అందుకే తెల్సినవాళ్ళనడిగి తెచ్చాను. యింతకన్నా మంచిది దొరకలేదు నాన్నా... సారీ" అంది.

ఎడతెగకుండా సెల్ మోగుతోనే ఉంది. మాట్లాడ్తూనే గబగబా కాఫీ తాగాను.

"కొద్దిసేపైనా ఆ సెల్ స్విచాఫ్ చేసి ప్రశాంతంగా కాఫీ తాగొచ్చుగా నాన్నా" అంది.

"కుదరదమ్మా. బిజినెస్ వ్యవహారాలు కదా. వ్యాపారంలో నంబర్ వన్‌గా ఉండాలంటే ఈ పరుగు తప్పదు" అన్నాను.

కాఫీ తాగాక నశీర్ చేస్తున్న బిజినెస్ గురించి మాట్లాడుకున్నాం.

"బిజినెస్ ని పెంచడానికి డబ్బు సాయం కావాలంటే చెప్పు బాబూ. పెట్టుబడి నేను పెడ్తాను" అన్నాను.

నశీర్ యిబ్బందిగా మొహం పెట్టాడు. కొన్ని క్షణాల మౌనం తర్వాత చెప్పాడు. "వద్దంకుల్. నా స్వశక్తితోనే పైకి రావాలి. మాకున్న పరిమితుల్లోనే ఏదైనా సాధించాలి. ఎవరి సాయమూ మాకక్కరలేదు. మీ మంచి మనసుతో దీవించండి చాలు"

సాయంత్రం రంగారాయుడు చెరువుకి వెళ్దామంది. కారులో వెళ్దామంటే "వద్దు నాన్నా.. నడుచుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ వెళ్దాం" అంది.

దార్లో పి.వి.ఆర్ స్కూలు వస్తే "కీర్తీ... తాతగారు చదువుకుంది ఈ స్కూల్లోనే" అంది.

"నాకు తెలుసులే మమ్మీ... యిప్పటికి బోలెడు సార్లు చెప్పావుగా"

రంగారాయుడు చెరువు గట్టున కూచున్నాక "తాతగారు చదువుకునే రోజుల్లో ఈ చెరువు గట్టునే లంచ్ చేసి ఈనీళ్ళనే తాగేవారు తెలుసా" అంది ప్రత్యూష.

"యిది కూడా ఎన్నిసార్లు చెప్పావో" అంటూ నావైపు తిరిగి "యిక్కడికొచ్చినపుడల్లా అమ్మది సేమ్ డైలాగ్ తాతయ్యా" అంది కీర్తి నవ్వుతూ.

ఎన్ని తీయటి జ్ఞాపకాలో... నా కూతురు ఏరి మరీ నా వొళ్ళో పోస్తోంది. యిన్నాళ్ళూ నన్ను నేను పోగొట్టుకుని యిక్కడ వెతుక్కుంటే దొరికినట్లు... యిన్నేళ్ళ శూన్యంలోకి అమృతాన్నెవరో ఒంపుతున్నట్లు...

ఎనిమిది వరకూ రోడ్లన్నీ తిప్పి "నాన్నా... నువ్వు చదువుకునే రోజుల్లో యిక్కడేం ఉండేదీ అక్కడేం ఉండేదీ" అంటూ నన్ను గతంలోకి చేయి పట్టుకుని లాక్కెళ్ళిపోయింది.

యింటికి తిరిగొచ్చాక "నాన్నా...మాతోపాటు కింద కూచుని భోం చేయలేవు... నీకు టీపాయ్ మీద పెడ్తాను. కుర్చీలో కూచుని తినేయ్" అంది.

చిన్న చాపలాంటిది పర్చుకుని దాని మీద నశీర్, కీర్తి కూచున్నారు.

ఎదురుగా ప్రత్యూష కూచుని వడ్డిస్తోంది.

గోంగూర పప్పు... వేయించిన మజ్జిగ మిరపకాయలు... బెండకాయ వేపుడు... టమేటా పచ్చడి...

"నాన్నా... యిది బండ పచ్చడి. మా యింట్లో మిక్సీ కూడా లేదుకదా" అంటూ నవ్వింది.

నాకు మా అమ్మ గుర్తొచ్చింది.

నా చిన్నప్పుడు అమ్మ పచ్చిమిరపకాయల్తో పచ్చడి చేస్తే ఎంత రుచిగా ఉండేదో.. వేడివేడి అన్నంలో పచ్చడి కలుపుకుని దాన్లో కాచిన నెయ్యి వడ్డించుకుని తింటుంటే స్వర్గం కన్పించేది. ఆ కారానికి వగరుస్తూనే ఆవురావురుమని తినేవాళ్ళం. యిలానే నేల మీద పీటలు వాల్చుకుని నేనూ, నాన్న, తమ్ముడు... ఎదురుగ్గా వడ్డిస్తూ అమ్మ... ఎంత మనోహరమైన దృశ్యంలా నా మనోఫలకం మీద చిత్రించబడిందో.. యిన్నాళ్ళకు మళ్ళా ఆ దృశ్యం సాకారమై...

భోజనాలయాక "జాజిపందిరి కింద మంచమేయనా... ఎండాకాలం కదా.. నేలంతా నీళ్ళు చల్లాను. మట్టి వాసన చూశావా ఎంత కమ్మగా వస్తుందో... ఓ వైపు జాజుల వాసన... మరోవైపుఉదారంగా కురుస్తున్న వెన్నెల... చాలా బావుంటుంది" అంది.

నేను యిబ్బందిగా చూశాను. "ఓ... నీకలవాటు లేదు కదా... సర్లె. నువ్వు లోపల పడుకో. మేం బైట పడుకుంటాం"అంది.

ఆ గదిలో ఫ్యాన్ తిరుగుతున్నా ఏ.సీ లేనందువల్ల రాత్రంతా నిద్రరాక యిబ్బంది పడ్డాను.

ఉదయం ప్రత్యూష నా చేతికి అక్షింతలిచ్చి కాళ్ళకు నమస్కారం చేసినపుడు మనసారా దీవించాను. "నీ పుట్టిన రోజుకి మీ అమ్మ పంపిన బహుమతి" అంటూ తన కోసం నిర్మల పంపిన చీర చేతిలో పెట్టాను.

"యిన్నేళ్ళ తర్వాత మా మీద కోపం పోయి నువ్వు యింటికి రావడం కన్నా అందమైన, విలువైన కానుక యింకేం ఉంటుంది నాన్నా" అంది.

నాకిష్టమని చేసిన పెసరట్లు తింటూ తిరుగు ప్రయాణం గురించి చెప్తే చాలా నొచ్చుకుంది. "అదేంటి నాన్నా... రాక రాక వచ్చావు. ఒక్క రోజు కూడా ఉండకుండా

వెళ్ళిపోతానంటావేం.. మా యిల్లు నచ్చలేదా" అంది. నశీర్ కూడా బతిమాలాడు.

"చక్కదిద్దాల్సిన బిజినెస్ వ్యవహారాలు చాలా ఉన్నాయి. చూస్తున్నారుగా ఎన్ని కాల్స్ వస్తున్నాయో... కోట్లలో చేసే వ్యాపారం కదమ్మా. టైంకీ డబ్బుకి లింకుంది. నేనెంత ఎక్కువసేపు కంపెనీకి దూరంగా గడుపుతానో అంతగా కంపెనీ నష్టపోతుంది" అన్నాను.

నిన్న యిచ్చిన కప్పులోనే కాఫీ యిచ్చింది. గబగబా తాగుతున్నాను. కీర్తి తనకూ అదే కప్పులో ఇమ్మని ఏడుస్తోంది. తన చేతిలో ఉన్న పింగాణీ కప్పుని కింద పెట్టేసింది. నశీర్ సముదాయించడానికి ప్రయత్నించినా వినలేదు.

"నాన్న కప్పు చూశావా.. సగం పగిలిపోయి, హ్యాండిల్ విరిగిపోయి ఎలా ఉందో... నీ కప్పే నాన్న కప్పుకంటే బెటర్ తెలుసా" అంది ప్రత్యూష.

"తాత చేతిలో కప్పు చాలా బావుంది. నాకందులోనే కావాలి. లేకపోతే అసలు వద్దే వద్దు నాకు" అంది కీర్తి.

"నీకో విషయం చెప్తాను విను. కప్పు ఎలా ఉందీ అనేది ముఖ్యం కాదు. కాఫీ ఎంత రుచిగా ఉందనేదే ప్రధానం. బంగారపు కప్పులో తాగినా మట్టి పాత్రలో తాగినా అదే కాఫీ. నువ్వు మీ తాతలా తయారౌతావా? ఆయన సంపాదన పిచ్చిలో పడి జీవితాన్ని ఆస్వాదించడమే మర్చిపోయాడు. ఆస్తులూ, అంతస్తులూ, హోదాలూ యివన్నీ పై మెరుగులే...నగిషీలు చెక్కిన కప్పులా... చక్కటి కాఫీలాంటిది జీవితం. తన కాఫీ కప్పు ఖరీదైంది ఉండాలనీ, అందరి కన్నా అందంగా ఉండాలనీ తాపత్రయపడ్తూ మీ తాత కాఫీరుచినే పట్టించుకోవడం మానేశాడు. నిజమైన సంతోషాన్ని, తృప్తినీ యిచ్చేది కాఫీ ఎంత క్వాలిటీగా ఉందీ... ఎంత రుచిగా ఉందీ అనే విషయమే తప్ప ఖరీదైన కప్పు కాదు" అని నా వైపు తిరిగి "యిలా అన్నందుకు ఏమీ అనుకోకు నాన్నా... సారీ... కోపంలో ఏదో అనేశాను" అంది.

సుదీర్ఘ నిద్రలోంచి ఎవరో బలంగా తట్టి లేపినట్లు... మత్తులో జోగుతున్న నామీద కుండతో చన్నీళ్ళు కుమ్మరించినట్లు... అడ్డదిడ్డంగా దారితెన్నూ తెలీకుండా పోతున్నవాణ్ణి చొక్కా పట్టుకుని ఆపి అసలైన దోవ చూపించినట్లు...

నిజమే... ఎంత బాగా చెప్పిందీ ప్రత్యూష.... నేను కాఫీ రుచిని ఆస్వాదించి ఎన్నేళ్ళయిందో... ఖరీదైన యిల్లు, ఖరీదైన కారు అని ఆలోచించినట్లే ఖరీదైన భోజనం

అని ఆలోచించాను తప్ప భోజనాన్ని ఆస్వాదిస్తూ తిని ఎన్నాళ్ళయిందో... నిర్మలతో మనసారా మాట్లాడి కొన్ని యుగాలైనట్లు... జీవితంలో ఏం కోల్పోతున్నానో తెల్సుకోకుండా పరుగులు పెట్టాను. బంగారంతో తాపడం చేసినట్లు ఖరీదైన భవంతి కట్టుకున్నాను కానీ ప్రేమ నిండిన పొదరిల్లుని కోల్పోయాను.

నా కప్పుని కీర్తికిచ్చి తన చేతిలోని కప్పు తీసుకున్నాను. అపుడు కీర్తి కళ్ళలో మెరిసిన మెరుపుని ఎన్ని కోట్లు ఖర్చు చేస్తే పొందగలను? కళ్ళు తుడుచుకుని ఆ కప్పులో కాఫీ తాగుతూ "థ్యాంక్స్ తాతా" అంది నవ్వుతూ. నేనిప్పటివరకూ గమనించలేదు కానీ కీర్తి నవ్వితే అచ్చం మా అమ్మ నవ్వినట్లే ఉంది.

సెల్ మోగుతోంది. స్విచాఫ్ చేశాను. కాఫీని నింపాదిగా తాగాను. మా అమ్మ చేసిన కాఫీలా ఎంత రుచిగా ఉందో...

నా వైపు ఆశ్చర్యంగానూ ఆనందంగానూ చూస్తున్న ప్రత్యూషతో "ప్రయాణం వాయిదా వేసుకుంటున్నానమ్మా. ఈ రోజంతా నా మనవరాలితో ఆడుకుంటూ గడిపేస్తాను. రాత్రికి నా మంచం జాజిపందిరి కింద వేయి. నా మనవరాలి ముద్దుముద్దు కబుర్లు వింటూ వెన్నెట్లో పడుకోవాలని ఉంది" అన్నాను.

కీర్తి కాఫీ తాగాక ఆ కప్పుని కడిగి "నాన్నా... అరువు తెచ్చిన ఈ కప్పు యిచ్చేసి వస్తాను. యిక దీని అవసరం లేదుగా" అంది ప్రత్యూష.

"ఎప్పటికీ ఉండదమ్మా" అన్నాను నా మనవరాల్ని ఎత్తుకుంటూ.

**(పాలపిట్ట ప్రత్యేక కథల సంచిక 2011)**